లాబొరేటరీలోంచి బయటికి వచ్చి హాయిగా, తనివితీరా కమ్మని గాలి పీల్చుకున్నాను. అంత దాకా ఊపిరితిత్తుల్లో నిండుకుని ఉన్న సల్ఫర్ డైయాక్సైడూ, ఈథరూ వగైరాలు కొంచం కొంచం బయటికి పోసాగాయి.

ఎదురుగా కన్పించాడు మూర్తి, ఫోర్సెప్స్‌తో పట్టుకుని ఒక పొడుగాటి కాగితంతో సహా.

“ఏం ? అయిపోయిందా ?” అని అడిగాను. తలూపాడు.

“ఇదో, ఇది అవతల పారేసివస్తా” అంటూ లోపలికి పోయాడు. మరో రెండు నిముషాల్లో ఇద్దరం బయటికి వచ్చాం. యూనివర్శిటీ బస్ స్టాప్ దగ్గర చేరాం.

“లీవు ఇచ్చాడా గురుడు ?” అని అడిగాడు.

“ఊ! కాని పది రోజులే, సైన్సు కాన్ఫరెన్సు ఉందిట .... ముందుగా రమ్మన్నాడు” అన్నాను.

ఇద్దరం కాస్సేపు మాట్లాడలేదు. తర్వాత మూర్తే మాట్లాడాడు.

“నేరుగా నెల్లూరికేనా, లేక ....”

“నెల్లూరే, బందరు పోదల్చుకోలేదు ఈసారి” తలూపాడు మూర్తి.

నేను రెండు నెలలుగా ప్రయత్నించి ప్రొఫెసర్ మెహతా దగ్గర నెల రోజులకు లీవు సంపాయించబోవడం, అది ఆఖరికి పది రోజులకి దిగడం మూర్తికి తెలుసు. ఇద్దరం ఒకే స్కూల్లో, కాలేజీలో చదివాం. ప్రాణస్నేహితులం .... ప్రస్తుతం ఇద్దరం యూనివర్శిటీలో సహాధ్యాయులం .... “రిసర్చి” అనే క్రీడాభిలాషులం .... గవర్నమెంటు ప్రతి నెలా రెండువందలయాభై ఇస్తున్నాళ్ళూ—ప్రొఫెసరు కళ్ళుతెరవనన్నాళ్ళూ ఫరవాలేదు .... మూర్తివేపు చూచాను. తలవంచి, చేతులు వెనక్కి కట్టుకుని, బూటు మొనతో నేలను తవ్వుతున్నాడు. దీర్ఘంగా ఆలోచించే సమయంలో మూర్తి భంగిమ అదే ....

“నెల్లూర్లో ఎన్నిరోజు లుంటావు ?” అని అడిగాడు అలాగే.

“అన్ని రోజులూ .... ఏమయినా పనుందా ?”

“ఊహూ .... చెప్తాను పద ....”

ఇద్దరం బస్ ఎక్కాం .... మూర్తి టిక్కట్లు తీసుకున్నాడు.

“మీ నాన్నగార్ని చూసి రమ్మంటావా ?” అన్నాను.

కాసేపు మూర్తి మాట్లాడలేదు.

“బహుశా నీకు వీలుపడదేమో ....”

“మరేం ఫర్వాలేదు .... అసలు చాలారోజు లయింది. పల్లెటూరి గాలి తగిలి .... పోయి, రెండ్రోజులుండి వస్తాను ....” అన్నాను నా అంతట నేనే సిద్ధమయి.

మూర్తి నిశ్శబ్దంగా తలూపాడు.

మరునటిరోజు స్టేషనులో కన్పించాడు. ఇద్దరం టీ నీళ్ళు తాగాం స్టాల్లో .... బండి కదిలే టైం అయింది, కంపార్టుమెంటులో కూర్చున్నాం. గార్డు విజిల్ ఊదాడు.

“ఏం చెప్పమంటావు ?” అని అడిగాను .... చెప్పాడు ....

“చూడు—నీకు తెలీందికాదు .... మా పిన్నికి

—36 వ పేజీ చూడండి

పండుటాకు
విజయ

సొంపుగ వ్రాయుటకు

కృష్ణవేణి

సిరా



సోల్ ఏజంట్లు

నేషనల్ ప్రొడక్ట్స్ సిండికేట్,

మద్రాసు - 21

క్రొత్త పెద్ద డబ్బా

కాల్గేట్

బేబీ పౌడరు

ఎక్కువ పౌడరు...

ఎక్కువ పొదుపు...

సులభంగా పెట్టగల

క్రొత్త మూత!



పసిపాప యొక్క

లేత చర్మమునకు

ఉపశమనము కలిగించును!

CGP-6-2 TEL

పండుటాకు

32వ పేజీ తరువాయి

నాకూ పడదు .... బాగున్నానని చెప్పు .... అంతే... సరేనా ?"

తలూపాను .... అంతకుముందెప్పుడూ అంత నేరుగా చెప్పలేదు....తర్వాత ఎందుకో హఠాత్తుగా అడిగాడు :

"నీ దగ్గర ఎంతవుంది ? డబ్బు—"

"అయిదు వందలు .... ఏం ? కాస్సేపు సమాధానం రాలేదు ....

"నీకేమయినా కావాలా ?" అని నేనే అడిగాను. తల అడ్డంగా ఊపాడు. 'మరేదో' ఉంది. లోపల సతమతమవుతూ పైకి, నా ఎదుట చెప్పలేక, తనలో దాచుకోలేక బాధపడుతున్నాడని గ్రహించాను ....

"మరేంలేదు .... వీలయితే మా నాన్నకి ఓ రెండు వందలు ఇచ్చెయి .... నీకు టి. ఎం. ఓ. చేస్తాను—లేకపోతే యిక్కడ యిస్తాను ...." అన్నాడు. తలూపి 'సరే' అన్నాను. చిరునవ్వుతో షేక్‌హాండ్ చేశాడు.

"ఆ, అన్నట్లు ఆయన్ను కొంచెం ఆరోగ్యం, అదీ .... జాగ్రత్తగా ఉండమను .... ఈమధ్య ఏదో .... కొంచం వంట్లో ...." తలూపాను .... మూర్తి తల దించేసుకున్నాడు.

రైలు కదిలింది. మూర్తి చేయి కదులుతూ కన్పించింది .... ఆ వెనుక, అతను గంభీరముద్ర తెరవెనుక, అతని గతం సంక్షిప్తంగా కనిపించింది.

* * *

మూర్తి తండ్రిపేరు శ్రీ కృష్ణశాస్త్రి. పేరు చూడగానే కనుక్కోవచ్చు--తెలుగు మేష్టారని .... అదీ, ఏదో చిన్నఊళ్లో, జీతాలురాని పంచాయితీ అజమాయిషీలో నలిగే పెంకుటిళ్ల 'హైస్కూల్లో' అని—

శ్రీ కృష్ణశాస్త్రిగారిని చూస్తే నేచాలు అసలు, ఆరడుగుల ఆజానుబాహువు, బ్రహ్మతేజస్సుఉట్టిపడేది స్ఫురద్రూపంలో. చక్కని మృదుశారీరం సమకూరగా వినసొంపుగా పద్యపఠనం ఆయనకు అలవడిపోయింది.

శాస్త్రిగారి క్లాసులో కూర్చుని ఆయననోటివెంట పారిన కవితాస్వాదనచేయని విద్యార్థి వుండేవాడుకాదు. అప్పుడప్పుడూ పాఠం వదిలేసి, మిగతాకావ్యాల్లోంచి 'మచ్చుకి' వినిపించేవారు శ్లోకాలూ పద్యాలు. విద్యార్థులు తలలూపి 'మరోటి' అనని దినంలేదు.

కణ్వాశ్రమంలోకి దుష్యంతుని ఆగమనం వర్ణించిన కవిరాజ విరాజితం లయబద్ధంగా శ్రావ్యంగా వినవచ్చేది:

"ఏచి తనర్చి తలిర్చిన తావుల నిమ్మగులేవుల..." అంటూ మరోసారి కాళిదాస కవితావాహినిలో ఓలలాడించేవారు.

"ఆషాఢస్య ప్రథమదివసే—మేఘ మాశ్లిష్టసానుం....వప్రక్రీడా పరిణతగజ— ప్రేక్షణీయం దదర్శ...." అని ఆ మేఘుడే ఉరిమినట్లు గంభీరత నింపేవారు....

శ్రీనాథుని సీసపుబరువు, పోతన నిరాడంబరత్వమూ, తిక్కన కందమూ, పెద్దన ప్రబంధమూ

ఆయన నోటినుంచి మధురాతిమధురంగా వెలువడేవి.. విద్యార్థులు ఆనందంతో అలిసిపోయేవారు విని. అర్థం కాకపోయినా అభిరుచి జన్మించేది. వెంటనే శాస్త్రిగారంటే ఆవిధంగా అందరికీ ఆప్తులయ్యారు.

స్కూల్లోనూ, మా ఊర్లోనే ఆగిపోలేదు శాస్త్రిగారి గొప్పతనం. ఆయన పీఠిక వ్రాసిన చెత్త పుస్తకాలు వేలుకువేలు ఖర్చుపోయేవి. ఆయన ఆశీస్సు నందుకోని నవకవి లేడాకాలంలో. ఆయన రచనలు చదవనివారు లేరు. సంస్కృతాంధ్రపై శొచికపాళీ భాషల్లో దిట్ట యని పేరు సంపాదించారు శాస్త్రిగారు. పండిత సభల్లో పూర్వాపర సిద్ధాంతం చేయుగల సమర్థులు. క్షణాలమీద ఆశుకవిత్వం చెప్పగల సరస్వతీసంపన్నులు. ఆయన లేని సారస్వతవేదిక, సంస్కృతీ సమితి ఒక్కటీ రాణించలేదు — జరుగలేదు.... ఆంధ్రావనిలో శ్రీ కృష్ణశాస్త్రిగారు తెలుగుదనానికీ తెలుగుకయితసొంపుకూ మారుపేరయి ఊరూరావెలిగారు..

ఇన్నిలక్షణాలున్న శాస్త్రిగారి పద్ధతి కాలానికి అనుగుణ్యంగా పోవడం నేర్చుకోలేదు. మూర్తిని ట్రైనింగు ప్యాసయి 'పంతులుగా' చేరమని కోరారు. తనలాగే తనకుమారుడు కీర్తివంతుడౌతాడని ఆయన ఆశ.

కాని మూర్తి అందుకు విరుద్ధంగా, తగవులాడి బి.యస్సీ చదివాడు.. నాతోపాటు — ఇద్దరం కలిసే యం.యస్సీకూడా పూర్తిచేశాము.. ఎన్నో సంవత్సరాలయిం దిప్పటికి.

శాస్త్రిగారికి వార్ధక్యం దుఃఖాన్నే తెచ్చింది. కంటిచూపు మందగించి, మతిమరపూ అలసటా హెచ్చయిపోయాయి. నలభై ఏండ్లకు ద్వితీయ కళత్రస్వీకారంచేసిన శాస్త్రిగారికీ యాభై తొమ్మిదవ ఏట నడుములువంగిన తాతగారికీ పోలిక ఎక్కడ! అపుడాయన విరబూసిన మ్రాను. ఇపుడు ఏళ్లనిండి వ్రేళ్ళునడలిన వృక్షం. ఆయన్ని చూడాలనగానే ఏదో బాధవేసింది. వయస్సు మళ్ళి జీవితంలో సంజవేళ దాటి రేయీ చీకటీ అలుముకొనే వయస్సులో, దాదాపు ఒంటరిగా, గతంలోని కీర్తి, కరిగిపోయిన దారుఢ్యం నీడల్లా సాగిపోతూవుంటే .... ఎవరికిమాత్రం మనో స్థయిర్యం వుంటుంది? తల్చుకుంటే మూర్తి మీద కోపంవచ్చింది....నెల్లూర్లోనే వుండి శాస్త్రిగారికి అండదండగా వుండాల్సిందిపోయి, ఆయన మీద పగసాధించినట్లు ఇలా తనొక్కడూ హాయిగా 'రిసర్చి' పేరిట తిరగడం నాకు న్యాయంగా కన్పించలేదు.

* * *

నెల్లూరుకుపోయిన నాలుగోరోజు మూర్తి వాళ్ళ ఊరికి పోయాను. అక్కడ శాస్త్రిగారి ఇల్లు కనుక్కునేసరికి కొంచెం కష్టం అయింది— ఇల్లు మారారుకాబోలు ఈలోపల. జాగ్రత్తగా వాకిలిముందే ఆగి చూశాను.

చిన్నపెంకుటిల్లు. ఇంటిముందు కొంచెం ఖాళీ చోటువుంది. వాకిలిముందు పెట్టినముగ్గు కొంచం మిగిలివుంది. సాయంత్రం ఆరూ, ఆరున్నర కాలేదు. కాని లోపల అప్పుడే లాంతరు వెలుగు తెలుస్తూంది.

కిటికీలోంచి ఒక ధోవతీ, సీటు ఉయ్యాలా, దూరంగా లోటా కన్పించాయి. గొంతు సరిచేసుకుని పిలిచాను. ఎవ్వరూ జవాబీయలేదు. మరోసారి పిలిచాను. ఎవరో వచ్చారు బయటికి. ముఖం నిండా గీతలు గీచినట్లున్నాయి రేఖలు.. పొడుగాటి ముక్కునుండి అప్పుడే పీల్చిన ముక్కుపొడివాసన తేలివచ్చింది. పాతకాలంనాటి సులోచనాల వెనుక నుంచి రెండు అంతకన్నా పురాతనమైన కళ్ళు నా మీద దృష్టి నిలిపాయి. కొద్దిగా వణుకుతూన్న కుడి చేయి చేతికర్రమీద ఆనివుంది.

"ఎవరు బాబూ?" అంది శరీరం, కించిత్ గద్గదంగా, కించిత్ గంభీరంగా ధ్వనించింది వాక్కు.

"శాస్త్రిగారు...." అన్నాను.

"ఆఁ?" అన్నారు ఒక చెవిపై చేయివుంచి. కొంచెం పెద్దగా అరిచాను.. తలూపాడు.

"రెండు అప్పాలు వెయ్యండమ్మా!" ఇంటిముందు ఆగిన బిచ్చగాడు కేకపెట్టాడు.

"అన్నం పనికి రాదా? అప్పాలు అడుగుతున్నావ్" ఇంటావిడ ఆశ్చర్యపోతూ అడిగింది.

"ఇవ్వాళ నా పుట్టిన రోజు. అందుకని..." బిచ్చగాడు తెలియ చెప్పాడు.

సి. గిరిధర రావు (తుని)

"నేనే—ఏంకావాలి?" అన్నాడు ఆయన అలాగే.

ఉలిక్కిపడ్డాను.. ఈ ముసలిమనిషి, కనబడీ కన్పడనికళ్ళు, వినబడనిచెవులు— వంగిపోయిన శరీరం.. వణికేచేతులు.. శాస్త్రిగారా?

నమ్మలేకపోయాను.. అప్రయత్నంగా నమస్కరించాను—మనసారా.. "కృష్ణార్పణమస్తు" అన్నారాయన.

"నేను — మూర్తి దగ్గర్నుంచి.." అన్నాను పెద్దగా.. తలూపాడు..

"నేను — అనుకుంటూనేవున్నాను.. పొద్దున సంధ్య వార్చుతూంటేను— కాకి ఒకటే అరపు.. అపుడే అనుకున్నాను.." లోపలికిరమ్మని దారి చూపాడు.

నెమ్మదిగా మాటమాటకు ఆగుతూ దీర్ఘం తీస్తూ, ముక్కుతో మాట్లాడుతూన్న ఆ వృద్ధుడే ఒకప్పుడు స్ఫుటంగా మేఘ గంభీరనాదంతో నెల్లూరు టౌనుహాలులో వేలకొలది రసజ్ఞులను ఉర్రూతలూగించిన "పండిత పితామహ" శ్రీ కృష్ణ శాస్త్రి అని ఎలా ఊహించగలను?

మేరువు నీరై పారగలిగినా, అది సాధ్యం కావచ్చేమో. కాని ఎదుట ఆయనే నిలబడి "నేనే అని అంటే!—నమ్మాల్సి వచ్చింది...గత్యంతరంలేక.

"కూర్చో నాయనా" అన్నారు శాస్త్రిగారు చూపరిచి.

వృద్ధాప్యంతో శరీరం నడలి, దేహదార్ఢ్యం నమసి, శారీర శుభ్రత తక్కువైనందున ఒక విధమైన దుర్వాసన వచ్చింది ఆయన దేహం నుంచి.

"మూర్తి ఎలా ఉన్నాడు? తిండీ, అదీ ...."

"బాగా ఉన్నాడండి .... ఇద్దరం ఒకచోటే ఉంటాం .... "

"మంచిది .... ఏదో .... ఎక్కడో—ఒకచోట .." అన్నారాయన.

"మీ ఆరోగ్యం అదీ .... "

వేదాంతిలాగా చిరునవ్వు నవ్వారాయన. గడచిపోయిన వసంతం రానున్న హేమంతాన్ని చూచి వణికినట్లు, శిశిరర్తువు తలచి వెలవెల బారినట్లుందా నవ్వు. తనకు తానే కనుక్కున్న ప్రకృతి సహజమైన శరీరవ్యథ అర్థంచేసుకున్న నవ్వు అది.

"ఏదో .... ఇలాగే .... అయినా, నా కింకా ఏం కావాలి? పిల్లా పాపా ఎవరున్నారు? కీర్తికీ, ప్రతిష్టకీ పాకులాడవల్సిన కాలం గడిచిపోయింది ... "

"మీరీమధ్య మరేమీ రాయలేదా మాష్టారూ?" అన్నాను.

తల అడ్డంగా ఊపాడు శాస్త్రిగారు—సాలోచనగా ....

కిటికీలోంచి ఆవిసెచెట్టు, తెల్లని విచిత్రమయిన పూలు కన్పించాయి. మరోవేపున మామిడిచెట్టు, వాడిపోయిన తీగె .... కళ్ళు బాధగా దించుకున్నాను.

"లేదు నాయనా ... ఆ రోజులు...పోయాయి ... పది నిముషాలు కూర్చునే ఓపికలేదు .... నాలుగు పంక్తులు రాయగానే వేళ్ళు ఆగిపోతాయి .... ఇక అంతే .... "

ఫిజిక్స్‌లో హిస్టిరిసిస్, ఫెటీగ్ చదివాను. మానవుల శరీర భాగాలూ అంతేనా?

సాభిప్రాయంగా చూచారాయన నావేపు. నేను ఆ వేళ్ళను చూచాను. పొడుగ్గా ఉన్నాయి. ముడుతలుపడి కొంత వికారంగా, గోళ్ళు పచ్చగా తయారయాయి. ఒకప్పుడు ఈ వ్రేళ్లే బంగరు ఉంగరాలతో మెరుస్తూ ఉండేవి .... ఆంధ్రసాహితిని అదిలించేవి—

"అప్పుడేదో రాసారని విన్నాను .... "

తల ఊపారాయన .... గతంలోంచి కొద్దికొద్దిగా సంఘటనలు వ్యక్తులూ తల్చుకుంటున్నట్లనిపించింది.

"నిజమే....అయినా దాన్ని ప్రచురించాలి కదా?"

"మీ రచనలన్నీ ప్రచురించిన కంపెనీ ఉంది గదా?" నవ్వాడు .... విషాదంగా, పేలవంగా.

"వాళ్ళు నా రచనల్నెందుకు ప్రచురించారు? అప్పుడు నేను ఆంధ్ర కవుల్లో పెద్దవాణ్ణి. నా ప్రతిమాటా, ముక్కా విలువచూపిన రోజులవి. నా నోటివాక్కు రాజాజ్ఞగా సాగిన రోజులవి. నాపేరు పెట్టుకుని బ్రతికిపోయారు వాళ్ళు .... అప్పుడు నాకు హోదా ఉంది .... సారస్వత పరిషత్తులో నేను ప్రథముణ్ణి .... కాని ఈరోజు ...."

అర్ధాంతరంగా ఆగిపోయా రాయన ....

"ఈరోజు మాత్రం మీరు .... "

అడ్డంగా తలూపారాయన ....

"వాళ్లు నన్ను మరిచిపోయారు నాయనా .... అవసరార్థమే ఎవరన్నా .... అవసరం దాటితే ... అంతా ఇంతే .... "

"మీరు ఎవర్నయినా చూచారా ?"

"చూచాను .... చాలామందిని .... ఒకరోజు ఎవరో అనామకులు వ్రాసిన పిచ్చి కూతలకి నా 'పీఠిక' ముందు పెట్టుకుని కడుపులు నింపుకున్న వాళ్ళు ఇవాళ నా రచనల్లోనే తప్పులు పట్టసాగారు"

"మీ రచనల్లో తప్పులా ? అంత తాహతు ఎవరికుంది మాష్టారూ ?" అన్నాను ఆశ్చర్యంగా.

"తాహతు ! హు! అందరూ నీలాంటివాళ్ళు కారు బాబూ—పాత రచనలమీద ప్రజానీకానికి రోత పుడుతూందట .... నవ్యజనతకు నవకవిత వినిపించాలిట .... గ్రాంథికం, ప్రబంధం అడుగున తొక్కి, క్రొత్త పంథాలు తొక్కాలిట !"

ఇద్దరం మాట్లాడలేదు.....

గాఢంగా ఓ నిట్టూర్పు విడిచా రాయన .... ఆ వేడి నిశ్వాసంలో తను సహించలేనిది, బాధా మయమయినదాన్ని అంతా, తన దేహాన్ని దహించే మన్నన్న దాన్నంతా కసితీరా బయట క్రక్కిన ట్లని పించింది.

"మీకు ప్రభుత్వం నుంచి పెన్షన్‌లాంటి దేదయినా .... "

"పెన్షనా ? వాళ్లకు నన్ను జ్ఞాపకం ఉంచుకోవా ల్సిన అగత్యం ఏమిటి ? నెలకో సభా సంవత్సరీకం లాంటి వార్షికోత్సవం చేస్తే చాలదూ ?" అన్నారు శాస్త్రిగారు లేచి నిల్చుని, కష్టంమీద.

రాత్రి కక్కడే ఉండాల్సి వచ్చింది.... భోజనం దగ్గర ఆయన అవస్థ చూడలేకపోయాను. రాత్రి కావడంవల్ల కళ్ళు సరిగ్గా కన్పడవు .... అలాగే, ఎట్లాగో, తడువుకుంటూ తినసాగా రాయన ....

రవి గాంచని సత్యాల్ని రమణీయంగా రాయ గల్గిన ఆ మనిషి, సామాన్యుల కందని ఊహలు చూపిన ఆ కండ్లు, అంతలో ఎలా మారాయి ?

కాలగమనం కటికవాడి లాటిది—అనిపించింది ...

ప్రొద్దున్నే నిద్ర లేచేసరికి ఆయన కన్పడ లేదు .... పెరట్లో పట్టుధోవతి కట్టుకుని సంధ్య వారుస్తూ కన్పించారు శాస్త్రిగారు.

గూడులాగా ఉన్న ఆయన వక్షంమీద విభూతి రేఖలు ప్రస్ఫుటంగా మెరిశాయి. మెడలో రుద్రాక్షమాల, ఎదురుగా పంచపాత్ర, ఉద్ధ రిణా, ధ్యానమగ్నుడైన శాస్త్రిగార్ని చూచి మన సులో నమస్కారం చేశాను .... త్వరగా దంత ధావనము ముగించి తుడుచుకుంటూ నిలబడ్డాను బావిప్రక్క .... శాస్త్రిగారు సంధ్య ముగించి లేచారు.

ఒక్క క్షణం అటువేపు చూడకుండా ఉండి ఉంటే అపాయం జరిగిపోయేదే—అదృష్టవశాత్తు చూచాను. .... నిలుచున్న శాస్త్రిగారు క్షణంసే పలాగే నిలబడి, తర్వాత అటూ యిటూ తూల సాగారు. అసంకల్పితంగా ఒక్క ఉదుటున ఆయన వద్దకు చేరేసరికి పడిపోతూ ఉన్నారు. గభాలున జాగ్రత్తగా పట్టుకున్నాను. నా రెండు చేతులతో వారిని అదుముకుని తులసికోట మీద కూర్చోబె

ట్టాను. చేతిలో నీళ్ళు తీసుకుని ఆయన ముఖం మీద చల్లి తుడిచాను .... పేరుపెట్టి పిలిచాను.

కాస్సేపటికి నెమ్మదిగా కండ్లు తెరిచారు శాస్త్రిగారు .... కండ్లలో కాంతి నశించిపోయి, పాలిపోయాయి. కండ్ల క్రింద నీడలు నిలిచాయి.

"శాస్త్రిగారూ, ఎలాఉంది ?" అన్నాను.

సమాధానంగా కళ్ళు మూసుకున్నారు. క్షణం సేపు—రెండు క్షణాలసేపు అలాగే ఉన్నారు.

వెంటనే, వణికినట్లు కదిలిపోసాగారు. కను కొలకుల నుంచి ద్రవీభూత హిమకణంలాగు రెండు కన్నీటిబొట్లు రాలాయి నా చేతిమీదికి. నిస్సహా యతా, బలహీనతా, బాధా మిళితమై, ఆలసటా, ఆశా, మనసూ కరిగిపోగా శాస్త్రిగారు కదిలిపోతూ ఏడువసాగారు .... కంటినీరు ధారగా కారి ముడుత గీతల్లోంచి జారి నా చేతిమీద పడసాగింది .... నా

"ఐతే ప్రేయసీ! నీ హృదయాన్ని యాచిస్తూ అందుకై దేవురిస్తూ ఇక్కడో భ్రమరం తిరుగుతున్నాడని మీ నాన్నగారితో చెప్పావా?" ప్రియుడు బోలెడంత ఆశగా తలెత్తి అడిగాడు. "ఆ! చెప్పాను" చెప్పిందా చిన్నది, "కాని ముష్టివాణ్ణి తన అల్లునిగా చేసుకోనని, యాచన నేరమని చెప్తున్నారు."

నిర్మల (ఒంగోలు)

మనసు వికలమయింది. మరింత దగ్గరగా తీసు కున్నాను. లాలించాను. ఎండిపోయిన ఆయన దేహాన్ని జాగ్రత్తగా లోనికి తీసుకెళ్ళి పరుపుమీద ఉంచాను .... తలక్రింద మెత్తగా తలగడా అదీ ఉంచాను.

"శాస్త్రిగారూ" అని పిలిచాను, ప్రక్కనే కూర్చుని .... కళ్ళు తెరిచారు ఆయన .... కొంచెం తేరుకొన్నారు.

"ఎలాఉంది ? ఇంకా కళ్ళు తిరుగుతుందా ?" అన్నాను.

"ఫరవాలేదు .... ప్రతిరోజూ ప్రొద్దునా ఇంతే."

ఎక్కడో గతంలోంచి, పాతాళంలోంచి వాక్కు వినవచ్చింది — ఎక్కడి మేఘ గంభీర నినదం — ఎక్కడి గద్గదమైన అస్ఫుటస్వరం !

"మందేం తీసుకోటంలేదా ?" అన్నాను.

"ఎలా నాయనా ? వాటికి తాళుకోలేను— ఉష్ణం చేస్తాయి .... కాకపోయినా చాలా ఖరీదు."

ఒక్కసారిగా మూర్తిమీద విపరీతమయిన కోపం వచ్చింది.

ఆయన్నలాగే విశ్రాంతి తీసుకోనిచ్చాను..... ఆయన అలాగే, అదే పట్టుపంచతో, రుద్రాక్ష లతో, విభూతితో నిద్రపోసాగారు .... గతమూ, వర్త మానమూ, భావీ లేని కాలంలోకి—బాధా, సుఖమూ నిరాశా ఆశా లేని నిద్రలోకి దిగజారిపోయారు.

మధ్యాహ్నం భోజనాలవేళకి ఆయన పూర్తిగా కోలుకున్నారు. ఇంట్లో గోడలకి తగిలించిన ఫొటో లన్నీ చూపించారు ఒక్కొక్కటీ—

"ఇది నా 'ఆంధ్ర సంస్కృతి' ప్రచురించిన రోజు నాకు సన్మానం చేసినప్పటి ఫొటో—కాశ్మీర శాలువా, వెయ్యిన్నూట పదహార్లు ఇచ్చారారోజు .... రెండూ పోయాయి—రెండూ లేవు—"

ఫొటో చూచాను. ఆజానుబాహువు, స్ఫుర ద్రూపి, తేజస్వి అయిన శ్రీ కృష్ణశాస్త్రిగారికి ఎవరో శాలువ కప్పుతున్నారు వినయంగా, గౌరవ ప్రదంగా—

"ఆయన పేరు రామమూర్తిగారా ?" అన్నాను చూసి.

"అనుకుంటాను— అవునవును— ఆయనే—" అన్నారాయన.

"ఆయన ఇప్పుడు సెంట్రల్ గవర్నమెంటులో పెద్ద ఆఫీసరు. ఆలిండియా రేడియోలో ఏదో డివిజన్" అన్నాను.

"ఆ రోజుల్లో ఆయన మాట్లాడితే గలభా చేసేవారు .... ఆయన రచనల్ని నేను రెకమెండు చేసింతర్వాత ఎక్కడయినా ప్రచురించేవారు ?" అన్నారు శాస్త్రిగారు చిరునవ్వుతో.

ఎన్నో సన్మానపత్రాలు—కాలేజీల్లో, హైస్కూ ళ్లలో సాహితీ, సంస్కృతీ, నాటక సంస్థల్లో — పుస్తకావిష్కరణ సమయాల్లో—ఎన్నో—ఎన్నో—

అమావాస్య గాఢాంధకారంలోంచి నిండు పున్నమి లోకి పోయినట్లనిపించింది. అవన్నీ జాగ్రత్తగా తుడిచి, అతి ఆప్యాయంగా అన్నీ ఎక్కడి వక్కడ ఉంచారు ఆయన .... ఆ సమయంలో శాస్త్రిగారి ముఖంమీద నిలిచిన విచిత్రమైన కాంతి, ఆనందం, తృప్తి నన్ను ఎంతో సంతోషపెట్టాయి.

వచ్చేది నిశీధి అని తెలిసినా క్షణికమైన సంధ్య ఎంత మనోరంజకంగా ఉంటుందో పగటి తర్వాత !

సాయంత్రం నాలుగు గంటలకి ఊరికి బయలు దేరాను. రోడ్డుదాకా వచ్చారాయన వద్దన్నా విన కుండా. తడబడుతూ చేతికర్రతో నడుస్తూ, అడుగడుక్కీ ఆయాసపడుతూ అలాగే వచ్చారు. రోడ్డు ప్రక్కన కంకరరాళ్లుపోసి ఉంచారు. ప్రక్కనే విశాలమయిన మర్రిచెట్టు .... దానికింద నిలిచాం యిద్దరం.

మూర్తి యిచ్చిరమ్మన్న రెండు వందలూ తీసి ఆయన కిచ్చాను. అడ్డంగా తలూపాడు.

"వాడికి చాలా అవసరం అవుతాయి ... నా కెందుకు" అన్నారు. బలవంతంచేసి, జేబులో ఉంచాను. దూరంగా దుమ్ము లేచింది .... మరో అరమైల్లో నన్ను మళ్లీ వెనక్కు తీసుకుపోయే మోటారు వస్తూంది .... ఆపిడప్పి, ఆల్కహాలూ రమ్మన్నాయి.

"మూర్తి నోమారు రమ్మని చెప్పుతావుకదూ ?" అన్నారు శాస్త్రిగారు. కంఠం బొంగురుపోయింది.

"శెలవు దొరికితేగాని చెప్పలేను" అన్నాను.

"కష్టమా ?" అని అడిగాడు.

"కొంచం — రిసర్చి చేసినా చేయకపోయినా ఇరవయినాల్గు గంటలూ ఉండాల్సిందేనండి అక్కడ" అన్నాను.

"వీలుచూసుకుని, ఓసారి రమ్మని చెప్పు బాబూ" ఆశగా, నిరాశగా, ఆవేదనగా విన్పించాయి మాటలు.

మూర్తికి సెలవు దొరుకుతుందో, లేదో ? దొరికినా, మూర్తి వస్తాడా ?

అంతదాకా శాస్త్రిగారు కాచుకుని ఉండగలరా? ఏం చూచుకుని ? అరిగిపోయిన శరీరం, అలసిపోయిన మనస్సు, రగిలి చల్లారిపోతున్న మేధస్సూ ఆయనకాపాటి ఆధారం ఇస్తాయని ఆశించడం— సత్యదూరం. కరిగిపోయిన ఉజ్జ్వల గతమూ, చీకటి పడినట్లు క్రమ్ముకుని వస్తూన్న భవిష్యత్తూ ఆశను చుట్టుముట్టి, ఆప్యాయతనూ, వాత్సల్యాన్నీ ఓడించగలవు—

శాస్త్రిగారివంక చూచాను. తల వంచుకునే అడిగారు.

"సెలవు దొరికితే వస్తాడా మూర్తి ? చాలా విషయాలు .... " పెండ్లి కాబోలు అనుకున్నాను. నవ్వు వచ్చింది .... మనుమడ్ని చూడాలని సహజమైన కోరిక పుట్టిఉంటుంది ! జీవనసంధ్య తుది వెలుగులు చీకటిరంగులు పులుముకుంటూన్న వయస్సులో ఎంత తీయని కోరిక ! తన్నెదిరించిపోయిన కొడుకు తిరిగి వస్తాడని ఎంత ఆశ!

బస్సు వచ్చింది....ఎక్కి కూర్చున్నాను. ఆయన నావేపు చూచారు. రంగువారిన కండ్లల్లో నక్షత్రాలు మెరిశాయి.

"మీ ఆరోగ్యం జాగ్రత్త మాష్టారూ !" అనగలిగాను.

"నాకేం బాధలేదు నాయనా, మరేం ఫర్వాలేదు !" అన్నారు ధీమాగా, నవ్వ ప్రయత్నిస్తూ, ఆశగా. అలాగే కావాలని ఆశించాను. చీకటి కూడా చల్లగానే రావాలి కదా జీవితంలోకి !

పైనుంచి ఏదో ఆయన చేతిమీద పడి, క్షణం సేపు నిలిచిం దక్కడే—దాన్ని తటాలున విదిలించుకున్నారు శాస్త్రిగారు. వణికిపోయా రాయన క్షణంలో—

నా గుండె కొట్టుకుంది — అది పచ్చబారి గాలికి రాలిన పండుటాకు. ★

సత్యనారాయణ

29–వ పేజీ తరువాయి

ఒళ్లంతా గజగజ లాడసాగింది. "ఏమబ్బాయ్?" అన్నారాయన మళ్లీ. పెల్లుబికిన సంతోషంతో అతడు 'ఊఁ' అన్నాడు. డి. యల్. గారు సత్యనారాయణకు మేకప్ చేయించి, బొమ్మలు తీసి — తన 'సిపాయికూతురు'లో హీరోవేషం ఇచ్చారు !

'పార్వతీప్రభావం'లో మణితో

ఇన్నాళ్ళ ఇన్ని అవస్థలుపడినందుకు ఫలితంగా ప్రప్రథమంగా 'హీరో'పాత్ర రావటంతో అతను మురిసిపోయాడు. నెలజీతంమీద మూడుసంవత్సరాలకు సత్యనారాయణను డి. యల్. గారు 'బుక్'చేసుకున్నారు. ఆసమయంలో అతను ఇతరచిత్రాలలో నటించేందుకు లేదు!

'సిపాయికూతురు' చిత్రం విడుదలైనతర్వాత, సత్యనారాయణకు నాలుగునెలలుదాకా మళ్లీ ఎక్కడా పాత్ర లభించలేదు. తాను చిత్రాలకు పనికిరానేమోననికూడా అనుకున్నాడు. 'సిపాయికూతురు' చిత్రంలోని తనపాత్ర ప్రజాదరణ పొందలేదు! దాంతో మళ్లీ అతను నిరుత్సాహపడ్డాడు.....

తర్వాత, విఠలాచార్యగారు సత్యనారాయణను మాడర్న్ థియేటర్స్‌వారికి పరిచయంచెయ్యగా 'సహస్రశిరచ్ఛేద అపూర్వచింతామణి' చిత్రంలో ఒక రాకుమారుడిపాత్ర ఇచ్చారు. తర్వాత అతను 'కనకదుర్గ పూజామహిమ'లోనూ, 'వరలక్ష్మీ వ్రతం' లోనూ దుష్టపాత్రలను నిర్వహించాడు. ఇటీవలవచ్చిన 'స్వర్ణగౌరి'లో శివునిపాత్రకాక, రెండు చిత్రాల్లో 'గెస్టు' వేషాలు వేశాడు. అవి: భీష్మలో" శివుడు, 'మోహినీరుక్మాంగద'లో విష్ణువూనూ. ప్రస్తుతంసత్యనారాయణ,'శ్రీకృష్ణార్జునయుద్ధం'లో కర్ణుడిగానూ, 'విష్ణుమాయలో' బలరాముడిగానూ, 'నువ్వానేనా'లో రౌడీగాను, 'లవకుశ'లో భరతుడిగాను, 'మదనకామరాజు'లో వృద్ధపాత్ర నరేంద్రవర్మగానూ నటిస్తున్నాడు. 'పార్వతీప్రభావం' లోనూ, వోల్గావారి చిత్రంలోనూ దుష్టభూమికలను నిర్వహిస్తున్నాడు. ఇదికాక 'శివగంగ మహిమ' 'శివరాత్రిమహిమ' అనే కన్నడచిత్రాలలోకూడా నటిస్తున్నాడు.

అట్లాగే మంచంమీద పడుకున్నాడు. తెల్లవారేసరికి మామూలుగా లేచికూచున్నాడు. "నేను బ్రతికేవున్నాను— నాకు సినిమా ఛాన్సు వుంది—సినిమా ఛాన్సు వుంది" అనుకున్నాడు గట్టిగా—'ఏమైనా సరే, నాప్రయత్నం నేను మానను" అని నిర్ధారించుకున్నాడు. ఆనాడు, బ్రతికివున్న సాలెపురుగు రాబర్ట్ బ్రూసుకు ధైర్యాన్నిస్తే, ఈనాడు చచ్చిన సాలెపురుగు ఈవిధంగా సత్యనారాయణకు ధైర్యాన్ని కలిగించింది!

సత్యనారాయణకు అప్పుడు ఆదాయమల్లా, రేడియోవాళ్లిచ్చే నాటకాలు. నెలకు ఒకటి రెండు సార్లు అతను రేడియోనాటకాల్లో పాల్గొనేవాడు. వాళ్లిచ్చిన డబ్బూ, ఇంటినుంచి తెప్పించుకుంటున్న డబ్బుతో అతను ఒకపూట తిని, రెండోపూట పస్తుపడుకునేవాడు. ఒకసారి రేడియోకు పావుగంట నాటికకూడా రాసియిచ్చాడు! దానిపేరు 'అంతుతెలియని అంతస్తులు.' ఈనాటకం రేడియోలో ప్రసారమైంది.

ఇట్లా వుండగా— బి. ఏ. సుబ్బారావుగారు, సత్యనారాయణను కె. వి. రెడ్డిగారికి పరిచయం చేశారు. అప్పుడు కె. వి. 'పెళ్లినాటిప్రమాణాలు' తీస్తున్నారు. ఆచిత్రంలో ఒకపాత్రకు అతన్ని 'టెస్టు'కూడా చేశారు. ఐతే, ఆటెస్టు సంతృప్తికరమైన ఫలితం ఇవ్వనందువల్లనో, లేక ఆ పాత్రకు ఇతను సరిపోడనో— కె. వి. రెడ్డిగారు, "నువ్వేం దిగులుపడకు, నీకు సరిపోయేవేషం వచ్చినప్పుడు, నేను తప్పకుండా యిస్తాను. నాచేతనైనంత సహాయం చేస్తాను.నువ్వు మీవూరువెళ్లి ఏంచేస్తావు? అక్కడేదో వుద్యోగానికి ప్రయత్నించాలి. ఆప్రయత్నమేదో ఇక్కడే చెయ్యి" అని ప్రోత్సహించి, అతన్ని గురించి ఇతరనిర్మాతలకూ దర్శకులకు చెబుతూవుండేవారు. ఆ సందర్భంలోనే కె. వి. గారు, సత్యనారాయణను డి. ఎల్. దగ్గరకు పంపించారు.

సత్యనారాయణను మొదటిసారి చూడగానే డి. యల్ "నాచిత్రంలో హీరో వేషం వుంది— వేస్తావూ?" అని అడిగారు. ఇది కలో, డి. యల్. గారు హాస్యం ఆడుతున్నారో అతనికి అర్థంకాలేదు.

కైకల సత్యనారాయణకు 60లో వివాహమైంది. రోజూ అతను వ్యాయామంచేస్తాడు, తీరుబడివుంటే పుస్తకాలు చదువుకుంటాడు. క్రికెట్ ఆటలో వీలున్న ప్రతిసాయంత్రమూ పాల్గొంటాడు. తనకు ప్రథమంగా అవకాశంకలిగించిన డి. యల్. గారు తనను తండ్రిలా చూచుకునేవారని, వారికి తన కృతజ్ఞతలు తెలుపుతూ— "నాకు నాటకాలంటే చాలాయిష్టం. నాటకాల్లోపాత్రలు ధరిస్తూనేవున్నాను. నేను మొదట హీరోగా ప్రవేశించినా, ప్రస్తుతం 'విలన్'పాత్రలనే ఎక్కువగా ధరిస్తున్నాను. పరిశ్రమ నన్ను విలన్‌గా గుర్తించింది. ఆ పాత్రలలో రాణించాలని, రాణించగలిగేందుకు అవకాశాలు కలుగుతాయనే ఆశిస్తున్నాను."అన్నాడు 'విలన్' సత్యనారాయణ, 'హీరో'లా మృదువుగా నవ్వుతూ. —సుకుమార్] ★